# సిరిధాన్యాలతో ఆరోగ్య సిరులు

సిరిధాన్యాలను (మిలెట్స్) ప్రధాన ఆహారంగా తీసుకుంటున్న ప్రజల్లో టేప్-2 మధుమేహ సమస్యలు తగ్గుతున్నాయని, మధుమేహం లేని వారిలో బ్లడ్ షుగర్ స్థాయి నియంత్రించబడి ఆ రుగ్మత రాకుండా ముందు జాగ్రత్తలతో నిరోధించవచ్చని 'ఫ్రాంటీయర్స్ ఇన్ న్యూట్రీషన్' పరిశోధన పత్రికలో అచ్చుయిన వ్యాసం వివరిస్తున్నది. యుకెకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ రీడింగ్, యన్ఐయన్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రీషన్), ఇక్రిసాట్ (ఇంటర్నేషనల్ క్రాప్స్ రిసర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ సెమి-అరిడ్ ట్రోపిక్స్)లు సంయుక్తంగా నిర్వహించిన పరిశోధనా ఫలితాలను తాజా పత్రిక ప్రచురితం చేసింది. ప్రపంచవ్యాప్తంగా 11 దేశాల్లో జరిపిన పరిశోధనల్లో మిలెట్స్‌ను ప్రధాన ఆహారంగా వాడడంతో బ్లడ్ షుగర్ లెవెల్స్ 12-15 శాతం తగ్గుతూ, డయాబెటిస్ సమస్య లేకుండా పోతున్నదని తెలుస్తున్నది. సిరిధాన్యాలు తీసుకునే వారిలో గ్లైసెమిక్ ఇండెక్స్ (జిఐ) నియంత్రించబడుతూ, హిమోగ్లోబిన్‌ను అంటుకొని ఉండే బ్లడ్ గ్లూకోస్ (హెచ్‌బిఏ1సి) స్థాయి 17 శాతం వరకు పడిపోయి షుగర్ సమస్య దూరం అవుతుందని వివరించారు.

"స్మార్ట్‌ఫుడ్"గా మిలెట్స్:

వ్యాసకర్తలు చేసిన పరిశోధనల్లో మిలెట్స్‌తో షుగర్ సంబంధాన్ని చర్చించిన దాదాపు 80 ప్రచురిత వ్యాసాలను సవివరంగా సమీక్షించడంతో పాటుగా సిరిధాన్యాలను 'స్మార్ట్ ఫుడ్' జాబితాలో చేర్చాలని సలహా ఇచ్చారు. గతంలో పలు ప్రాంతాల్లో మిలెట్స్‌తో పాటు జొన్నలను కూడా తీసుకునే అలవాటు ఉండేది. బియ్యం, గోధుమలు, మొక్క జొన్నల ప్రాధాన్య పెరిగిన తరువాత సిరిధాన్యాల వాడకం పూర్తిగా తగ్గిపోయింది. నేటి మధుమేహ సమస్యలతో సతమతమవుతున్న విశ్వమానవాళి దృష్టి మళ్లీ మిలెట్స్ వైపుకు మళ్లడం, 'జిఐ' తగ్గడంతో టైప్-2 డయాబెటిస్‌ను జయించడం హర్షదాయకం.

మధుమేహ రుగ్మతలకు చక్కటి పరిష్కారం:

ఇండియా, చైనా, యుయస్ దేశాల్లో మధుమేహ రుగ్మతలు అధికంగా ఉన్నాయి. ఆఫ్రికా దేశాల్లో 2019 నుంచి 2045 వరకు మధుమేహ సమస్య 143 శాతం, మిడిల్ ఈస్ట్ - నార్థ్ అమెరికాలో 96 శాతం, సౌత్ ఈస్ట్ ఏరియాలో 74 శాతం పెరగవచ్చని అంచనా వేశారు. ఆఫ్రికా, ఆసియాల్లో మధుమేహ నియంత్రణకు ఏకైక సులభ మార్గమైన సిరిధాన్యాలను ప్రధాన ఆహారంగా వాడకమే అని తెలుస్తున్నది. మిలెట్స్‌లో జిఐ (గ్లైకమిక్ ఇండెక్స్) 52.7 ఉంటుందని, బియ్యం/గోధుమలతో పోల్చితే 36 శాతం, మొక్క జొన్నలతో పోల్చితే 14-37 తక్కువగా ఉంటుందని తెలుస్తున్నది. మిలెట్స్‌ను ఉడికించిన తరువాత కూడా జిఐ విలువ బియ్యం/గోధుమలు/మక్కల కన్న తక్కువగానే ఉంటుందని వివరించారు. జిఐ విలువను బట్టి బ్లడ్ షుగర్ లెవల్స్ ఎంత వరకు, ఎంత తొందరగా పెరుగుతాయో తెలుస్తుంది. మధుమేహ అదుపుకు జీవనశైలి మార్పులు, తీసుకునే ఆహార పదార్థాల స్వభావం లాంటివి దోహదపడతాయి.

మిలెట్స్‌తో పలు ప్రయోజనాలు:

ప్రపంచంలో నేడు 463 మిలియన్ల మధుమేహ రోగులు ఉన్నారని, 2045 నాటికి 700 మిలియన్లకు చేరవచ్చని అంచనా. ప్రపంచంలోని ప్రతి ఆరుగురు మధుమేహ రోగుల్లో ఒక్కరు భారతీయులు ఉంటారు. చైనాలో 116 మిలియన్లు, ఇండియాలో 77 మిలియన్లు, యుయస్‌లో 31 మిలియన్లు, పాకిస్థాన్‌లో 19 మిలియన్లు, బ్రెజిల్‌లో 17 మిలియన్లు, మెక్సికోలా 13 మిలియన్లు, ఇండోనేషియాలో 11 మిలియన్ల మధుమేహ రుగ్మతలు కలిగిన వారు ఉన్నారు. అధిక ప్రజలు మధుమేహ సమస్యతో సతమతమవుతున్నారు. ప్రపంచ దేశాల్లో ఒక వైపు పోషకాహారలోపం మరో వైపు అధిక పోషకాహార లభ్యత లాంటి సమస్యలు జీవనశైలి రుగ్మతలకు కారణం అవుతున్నాయి. పోషకాహారలోపం, ప్రపంచ ఆరోగ్య సంక్షోభం, ప్రకృతి వనరుల విచ్ఛిన్నం, వాతావరణ మార్పులకు సమాధానంగా సిరిధాన్యాల వాడకం ఉపయోగపడుతుందని అభిప్రాయ పడుతున్నారు. గత ఐదు ఏండ్లుగా ఇక్రిశాట్ నిర్వహించిన 'స్మార్ట్ ఫుడ్ ఇనిషియేటివ్-2021' అధ్యయనాల్లో సిరిధాన్యాల వాడకంతో మధుమేహమే కాకుండా రక్తహీనత, ఐరన్ పోషక అవసరం, కొలెస్టరాల్, కార్డియోవాస్క్యులార్ వ్యాధులు, కాల్షియం/జింక్ ధాతు లోపాలపై మెటా-విశ్లేషణలు చేయడం సంతోషదాయకం.

మనకు అందుబాటులో ఉన్న 11 రకాల మిలెట్స్‌లో జిఐ 55 నుంచి 69 వరకు ఉండడం గమనించబడింది. ఆరోగ్య ఆహారంగా సిరిధాన్యాలను స్మార్ట్-ఫుడ్‌గా గుర్తించి, బియ్యం/గోధుమలు/మక్కల వాడకాన్ని తగ్గించి, జీవనశైలి మార్పులను ఒంటపట్టిమధుమేహం లేని మానవ సమాజాన్ని నిర్మించుకుందాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# ప్రజల భద్రతకు అనుగుణంగానే పెట్రోలియం మరియు పేలుడు పదార్థాల పరిశ్రమలకు అనుమతులు: కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖామంత్రి శ్రీ పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, జులై 5 :పెట్రోలియం మరియు పేలుడు పదార్థాల భద్రత సంస్థ (పి.ఈ.ఎస్.ఓ.) పనితీరు సామర్థ్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో పెట్రోలియం, పేలుడు పదార్థాలు, బాణసంచా మరియు ఇతర సంబంధిత పరిశ్రమల ప్రముఖుల దృక్కోణాలను మరియు అభిప్రాయాలను తెలుసుకునేందుకు కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రి శ్రీ పీయూష్ గోయల్ అధ్యక్షతన నిన్న న్యూఢిల్లీలో వాటాదారుల సదస్సు నిర్వహించారు. పెట్రోలియం మరియు పేలుడు పదార్థ పరిశ్రమలకు అనుమతులు ప్రజా భద్రతకు అనుగుణంగానే జారీ చేయాలని శ్రీ గోయల్ పేర్కొన్నారు. ఈ వాటాదారుల సదస్సు డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డి.పి.ఐ.ఐ.టి.) ఆధ్వర్యంలో నిర్వహించబడింది.

పి.ఈ.ఎస్.ఓ. ద్వారా మంజూరయ్యే లైసెన్సుల కోసం మహిళా వ్యాపారవేత్తలకు 80%, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు 50% లైసెన్స్ ఫీజు రాయితీని శ్రీ గోయల్ ప్రకటించారు. 30 నుండి 50 మీటర్లలోపు నివాసాలు ఉన్న ప్రాంతాలలో పెట్రోల్ పంపుల రిటైల్ అవుట్‌లెట్లను నిర్వహించేలా భద్రతా చర్యల విధానాన్ని రూపొందించడానికి కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సి.పి.సి.బి.) మరియు పెట్రోలియం మరియు సహజ వాయువు మంత్రిత్వ శాఖ (ఎం.ఓ.పి.ఎన్.జి.)తో సంప్రదించి మార్గదర్శకాలను రూపొందించాలని పి.ఈ.ఎస్.ఓ.ని ఆయన ఆదేశించారు.

గ్యాస్ సిలిండర్స్ రూల్స్ (జీసీఆర్) ముసాయిదాలో సిలిండర్ల కోసం క్యూఆర్ కోడ్‌ను కేటాయించడం గురించి పొందుపరిచామని, త్వరలోనే దానికి సంబంధించి తుది నోటిఫికేషన్ వెలువడుతుందని మంత్రి తెలిపారు. పేలుడు పదార్థాలు, వాటి రవాణా, తయారీకి సంబంధించి పదేళ్లపాటు లైసెన్సు ఇవ్వడంలో సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసేందుకు కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. పేలుడు పదార్థాలు మినహా అన్ని లైసెన్సులు పదేళ్ల కాలానికి ఇవ్వబడుతున్న క్రమంలో వీటి కోసం కూడా లైసెన్స్ యొక్క చెల్లుబాటును 10 సంవత్సరాలకు పెంచే అంశాన్ని ఆ కమిటీ పరిశీలిస్తుంది.

ఈ ప్రక్రియ మరింత సజావుగా కొనసాగించుటకు, మరిన్ని ప్రాంతాల్లో థర్డ్ పార్టీ ఇన్‌స్పెక్షన్ ఏజెన్సీలను (టి.పి.ఐ.ఎ.) దీనిలో భాగం చేయడానికి కృషి చేయాలని మంత్రి ఆదేశించారు. ఇప్పటికీ ఆఫ్‌లైన్ విధానంలో కొనసాగుతున్న కొన్ని ఏరియాల కోసం ఆన్‌లైన్ పర్మిషన్ మాడ్యూల్స్ పి.ఈ.ఎస్.ఓ. ద్వారా అభివృద్ధి చేస్తామని ఆయన చెప్పారు. పి.ఈ.ఎస్.ఓ.లో ఖాళీల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని శ్రీ గోయల్ ఆదేశించారు.

పెట్రోల్ పంప్ లైసెన్సులు పెట్రోలియం నిబంధనలు 2002 యొక్క ఫారం బీఎ ప్రకారం జారీ చేస్తుండగా అవే పెట్రోల్ రిటైల్ అవుట్‌లెట్‌లలో నిర్వహించబడుతున్న సి.ఎన్.జి. డిస్పెన్సింగ్ సదుపాయాలకు గ్యాస్ సిలిండర్ నిబంధల యొక్క ఫారం జి ప్రకారం లైసెన్స్ జారీ చేస్తున్నారు. రెండు లైసెన్సులు వేర్వేరు నిబంధనలు, చట్టాల ప్రకారం జారీ చేయబడుతున్న క్రమంలో, అదే పెట్రోల్ పంపులోని సి.ఎన్.జి. సదుపాయాల కోసం లైసెన్స్ మంజూరు చేసిన తరువాత ఫారం బీఎ లోని లైసెన్సులో కూడా సవరణలు చేయాల్సి ఉంటుంది. ఈ సవరణ మాడ్యూల్స్‌లో అవసరమైన మార్పులతో చేయబడుతుంది. ఇది అనుమతులు మంజూరు చేయడంలో భారాన్ని తగ్గిస్తుంది అలాగే పి.ఈ.ఎస్.ఓ. పనిభారాన్ని తగ్గిస్తుంది.

చర్చల సందర్భంగా, శ్రీ పీయూష్ గోయల్ పి.ఈ.ఎస్.ఓ.లోని ప్రక్రియలను మరియు అనుమతులను సులభతరం చేయాలని ప్రధానంగా ప్రస్తావించారు అలాగే పెట్రోలియం మరియు పేలుడు పదార్థాల నియంత్రణ కోసం ప్రపంచవ్యాప్తంగా అనుసరించబడుతున్న అత్యుత్తమ పద్ధతులను అవలంబించాలని ఆదేశించారు. దరఖాస్తులను పరిష్కరించుటకు పీ.ఈ.ఎస్.ఓ. అధికారులు కచ్చితంగా సమయపాలన పాటించాలని కోరారు. వివిధ అనుమతులు, లైసెన్సుల కోసం తరచుగా అడిగే ప్రశ్నలను రూపొందించి అందించాలని కూడా నిర్ణయించారు. లైసెన్సింగ్ సిస్టమ్ ఫర్ డిస్ట్రిక్ట్ అథారిటీ (ఎల్.ఎస్.డి.ఎ.) ఆన్‌లైన్ సిస్టమ్ ద్వారా జిల్లా అధికారులు ఎన్.ఓ.సి. జారీ చేయాలని మంత్రి ఆదేశించారు.

చర్చల సందర్భంగా పరిశ్రమ అందించిన సూచనలు మరియు లేవనెత్తిన సమస్యలపై మంత్రి స్పందిస్తూ, వారు చేసిన సూచనల వివరాలను రూపొందించడానికి కమిటీలను ఏర్పాటు చేయాలని ఎం.ఓ.పి.ఎన్.జి., సంబంధిత పరిశ్రమ సంఘాలను మంత్రి ఆదేశించారు. ఈ కమిటీలు అత్యుత్తమ పద్ధతులు మరియు ప్రమాణాలను అధ్యయనం చేసి సిఫార్సులను అందించే బాధ్యత కలిగి ఉంటాయన్నారు. అనుమతుల ప్రక్రియలు వేగంగా, సజావుగా జరిగేందుకు నియంత్రణకు సంబంధించిన నిబంధలను, విధానాన్ని సమీక్షించి సవరణలను ప్రతిపాదించాలని ఆయన పరిశ్రమ కమిటీలకు సూచించారు. పరిశ్రమకు చెందిన ప్రతినిధులు, పి.ఈ.ఎస్.ఓ. అధికారులు, డి.పి.ఐ.ఐ.టి. అధికారులు, సి.పి.సి.బి, ఎమ్.ఓ.పి.ఎన్.జి. మరియు చమురు కంపెనీల అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేసి వారు సూచించిన సంస్కరణలపై సమయానుకూలంగా పనిచేయాలని డి.పి.ఐ.ఐ.టిని ఆయన ఆదేశించారు.

ఈ సదస్సు కోసం దేశవ్యాప్తంగా గల పెట్రోలియం, పేలుడు పదార్థాలు, ఇతర సంబంధిత రంగాలకు చెందిన 150కి పైగా వాటాదారులు ఒకే చోటకు చేరారు. సమావేశ సమయంలో, ఫెడరేషన్ ఆఫ్ అగ్రివాల్యూ చైన్ మానుఫాక్చరర్స్ అండ్ ఎక్స్‌పోర్టర్స్ (ఎఫ్.ఎ.ఎమ్.ఇ.), ఎక్స్‌ప్లోజివ్స్ మానుఫాక్చరర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఇ.ఎమ్.డబ్ల్యూ.ఎ.), ఇండియన్ అమోనియమ్ నైట్రేట్ మానుఫాక్చరర్స్ అసోసియేషన్ (ఐ.ఎ.ఎన్.ఎమ్.ఎ.) అలాగే ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ గ్యాస్ మానుఫాక్చరర్స్ అసోసియేషన్ (ఎ.ఐ.ఐ.జి.ఎమ్.ఎ) వంటి పరిశ్రమ అనుబంధ సంఘాలు విధానాలను క్రమబద్ధీకరించడానికి మరియు వ్యాపారాన్ని సులభతరం చేయడానికి నిబంధనలు, కార్యాచరణను మెరుగుపరచడం కోసం కీలకమైన సూచనలను ప్రస్తావించాయి.

విచారణలకు త్వరిత ప్రతిస్పందనలు అందించేలా చూడడం ద్వారా ఎన్.ఓ.సీలు మరియు లైసెన్స్‌లను సకాలంలో జారీ చేస్తూ పి.ఈ.ఎస్.ఓ. ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా డిజిటలైజేషన్ మరియు పారదర్శకతను మెరుగుపరిచేందుకు సిఫార్సులు చేశారు.

పేలుడు పదార్థాల చట్టం, 1884, పెట్రోలియం చట్టం, 1934 ప్రకారం రూపొందించబడిన నిబంధనల అమలులో డి.పి.ఐ.ఐ.టి. నేతృత్వంలో పనిచేసే పి.ఈ.ఎస్.ఓ. కీలక పాత్ర పోషిస్తుంది. ఇటీవలి సంవత్సరాలలో, పి.ఈ.ఎస్.ఓ., పేపర్‌లెస్ లైసెన్సింగ్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టడం, అనుమతుల కోసం ఖచ్చితమైన వేళలకు కట్టుబడి ఉండడం, థర్డ్-పార్టీ ఇన్‌స్పెక్షన్ ఏజెన్సీలను ఏకీకరించడం సహా అనేక సంస్కరణలను ప్రవేశపెట్టినది అయితే అవన్నీ అనుమతి మంజూరు విధానాలను సులభతరం చేయుటను, ప్రమాదకర పదార్థాలతో వ్యవహరించే ఈ పరిశ్రమల అంతటా భద్రతా ప్రమాణాలను బలోపేతం చేయుటను లక్ష్యంగా కలిగి ఉన్నాయి.

ఈ వాటాదారుల సదస్సు పెట్రోలియం మరియు పేలుడు పదార్థాల రంగాలలో అనుకూలమైన నియంత్రణ వాతావరణాన్ని పెంపొందించడానికి పరస్పర సహకారంతో పనిచేయాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పాయి. అనుమతుల జారీ విషయంలో భారాన్ని తగ్గించడం, వ్యాపారాన్ని సులభతరం చేయడం, దేశవ్యాప్తంగా పరిశ్రమ ప్రమాణాలను కాపాడుటకు డి.పి.ఐ.ఐ.టి స్థిరమైన నిబద్ధత కలిగి ఉంది. డి.పి.ఐ.ఐ.టి ప్రస్తుత వాటాదారుల భాగస్వామ్యం పట్ల తన నిబద్ధతను పునరుద్ఘాటించింది, పి.ఈ.ఎస్.ఓ.లోని నిబంధనల ప్రక్రియలను మరింత సరళీకరించాలనే అభిప్రాయాన్ని అమలు చేయుటకు ప్రతిజ్ఞ చేసింది. నియంత్రణకు ప్రమాద-ఆధారిత విధానాన్ని అవలంబించే కార్యక్రమాల అమలు, నియంత్రణ సంస్థల సామర్థ్యాన్ని పెంపొందించడం మరియు మెరుగైన డిజిటల్ పరివర్తనలు మంత్రిత్వ శాఖ ప్రధాన ప్రాధాన్యతలుగా పేర్కొనబడినవి.

# రష్యన్ ఫెడరేషన్.. రిపబ్లిక్ ఆఫ్ ఆస్ట్రియాలలో (2024 జూలై 08-10 మధ్య) ప్రధాని పర్యటన

న్యూఢిల్లీ, జులై 5 :ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2024 జూలై 08-10 తేదీలలో రష్యన్ ఫెడరేషన్ సహా రిపబ్లిక్ ఆఫ్ ఆస్ట్రియాలో అధికారికంగా పర్యటిస్తారు. ఈ మేరకు రష్యా సమాఖ్య అధ్యక్షుడు గౌరవనీయ వ్లాదిమిర్ పుతిన్ ఆహ్వానం మేరకు 2024 జూన్ 8,9 తేదీల్లో ప్రధానమంత్రి మాస్కో సందర్శిస్తారు. ఈ సందర్భంగా వ్లాదిమిర్ పుతిన్ అధ్యక్షతన సాగే 22వ భారత్-రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొంటారు. ఇందులో భాగంగా దేశాధినేతలిద్దరూ రెండు దేశాల మధ్యగల బహుముఖ సంబంధాలను సమీక్షిస్తారు. అలాగే పరస్పర ప్రయోజనంగల సమకాలీన ప్రాంతీయ-అంతర్జాతీయ అంశాలపై అభిప్రాయాలను పంచుకుంటారు.

ఆ తర్వాత 2024 జూలై 09-10 తేదీల్లో ఆస్ట్రియా పర్యటనకు వెళ్తారు. కాగా, గడచిన 41 సంవత్సరాల్లో భారత ప్రధాని ఒకరు ఆ దేశాన్ని సందర్శించడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా రిపబ్లిక్ ఆఫ్ ఆస్ట్రియా అధ్యక్షుడు గౌరవనీయ అలెగ్జాండర్ వాన్ డెర్ బెలెన్ సహా చాన్సలర్ మాననీయ కార్ల్ నెహామర్‌తో సమావేశమై పలు అంశాలపై చర్చిస్తారు. అనంతరం భారత- ఆస్ట్రియా దేశాల వాణిజ్య ప్రముఖులతో సమావేశంలో ప్రధానమంత్రి, చాన్సలర్ ప్రసంగిస్తారు. కాగా, ఈ పర్యటనలో భాగంగా మాస్కోతోపాటు ఆస్ట్రియాలోని వియన్నా నగరంలోనూ ప్రవాస భారత సమాజ సభ్యులతో సంభాషిస్తారు.

# అప్పుల్లో కూరుకుపోయాం ..ఆర్థికంగా ఆదుకోండి- నిర్మలకు చంద్రబాబు వినతి

## -అభివృద్ధికి ఇతోధిక సాయం చేయండి
## -ఆర్థిక మంత్రి నిర్మలకు ఏపీ సీఎం వినతి
## -కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్, నడ్డా, హర్దీప్ సింగ్‌లతో భేటీ



న్యూఢిల్లీ, జులై 5 :గత ప్రభుత్వనిర్ణయాలు, పనుల కారణంగా రాష్ట్రం వీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిందని, ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులలో ఉందనిఏపీ సీఎం చంద్రబాబు నాయుడు శుక్రవారం కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కు వివరించారు. ఆర్థికంగా తమ రాష్ట్రాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో ఏపీ సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా.. వివిధ మంత్రులతో భేటీ అవుతున్నారు. ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలను కలిసి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్రం నుంచి తగినంత సహాయం చేయాలని కోరారు. నిర్మలతో జరిగిన భేటీలో పెమ్మసాని చంద్రశేఖర్, ఎన్డీయే ఎంపీలు ఉన్నారు. అనంతరం కేంద్రమంత్రులు రాజ్ నాథ్ సింగ్, జేపీ నడ్డాల, హర్దీప్ సింగ్ లతో భేటీ అయ్యారు.

సాయంత్రంలోగా మరికొందరు కేంద్ర మంత్రులతోనూ చంద్రబాబునాయుడు సమావేశమై.. రాష్ట్రపరిస్థితుల గురించి వివరించనున్నారు. జపాన్ రాయబారితోనూ చర్చలు జరుపనున్నారు.

సాయంత్రం హైదరాబాద్ రాక..

సాయంత్రానికి ఢిల్లీ పర్యటన పూర్తి చేసుకుని చంద్రబాబు హైదరాబాద్ బయల్దేరనున్నారు. ఈ సాయంత్రం భాగ్యనగరంలో చంద్రబాబు భారీ ర్యాలీలో పాల్గొంటారు. రేపు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో భేటీ కానున్నారు.నిన్న ప్రధాని నరేంద్ర మోదీతో పలువురు కేంద్రమంత్రులతో సమావేశమైన చంద్రబాబు కీలక విషయాలపై చర్చించారు. ముఖ్యంగా రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని, రాజధాని అమరావతి నిర్మాణానికి చేయూతనందించాలని ప్రధానిని కోరారు. అలాగే ఈ నెల నాలుగో వారంలో కేంద్ర బడ్జెట్ సమావేశాలు జరగనుండగా.. అందులో ఏపీకి ఇచ్చే ప్రాధాన్యతపై చర్చించారు.అమరావతి నిర్మాణానికి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తన తొలి జీతాన్ని విరాళంగా ఇచ్చారు. సీఎం చంద్రబాబునాయుడికి రూ. 1.57 లక్షల చెక్కును అందజేశారు. రాజధాని నిర్మాణానికి విరాళమిచ్చిన ఎంపీని చంద్రబాబు అభినందించారు.

# లోగోలతో కూడిన నకిలీ, మోసపూరిత ఇ-మెయిల్‌లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

న్యూఢిల్లీ, జులై 5 :సైబర్ క్రైమ్ ఇప్పుడు కొత్త పుంతలు తొక్కుతోంది. సాధారణ ప్రజలను భయపించి, ఆందోళనకు గురిచేసేలా అనేక పద్ధతులు అవలంబిస్తున్నారు సైబర్ నేరగాళ్లు. పలువురిని మోసం చేసేందుకు మోసగాళ్లు పలు నకిలీ, మోసపూరిత ఈ-మెయిల్స్‌ను సర్క్యులేట్ చేసినట్లు పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి వచ్చింది. ఇటువంటి నకిలీ ఇమెయిల్‌లుకి జత చేసి ఉన్న లేఖలో శ్రీ సందీప్ ఖిర్వార్, ఏడిజి, సైబర్ క్రైమ్ అండ్ ఎకనామిక్ అఫెన్స్, ఢిల్లీ పోలీస్ హెడ్‌క్వార్టర్స్, న్యూ ఢిల్లీ, అలాగే శ్రీ అనుపమ్ ప్రకాష్, జాయింట్ సెక్రటరీ (కోఫెపోసా), సెంట్రల్ ఎకనామిక్ ఇంటెలిజెన్స్ బ్యూరో యొక్క సంతకాలు ఉన్నాయి. (సిఈఐబి),ఇంటెలిజెన్స్ బ్యూరో, సైబర్ సెల్, న్యూ ఢిల్లీ స్టాంపులు, లోగోలతో ఉన్నాయి.

ఈ లేఖలో పిల్లల అశ్లీలత, పెడోఫిలియా, సైబర్ అశ్లీలత, లైంగిక అసభ్యకరమైన ప్రదర్శన, గ్రూమింగ్ మొదలైన వాటిని ఆ ఇ-మెయిల్‌ల రిసీవర్లకు ఆపాదిస్తూ ఆరోపణలు ఉన్నాయి.

అటాచ్‌మెంట్‌తో పైన పేర్కొన్న నకిలీ ఇ-మెయిల్‌లను పంపడానికి మోసగాళ్లు వేర్వేరు ఇ-మెయిల్ చిరునామాలను ఉపయోగించారు. ఈ విషయంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. ప్రజల సూచన కోసం నకిలీ లేఖ కాపీ, క్రింద ఇవ్వడం జరిగింది.

అటువంటి ఇ-మెయిల్‌ను స్వీకరించేవారు ఈ మోసపూరిత ప్రయత్నాలను గమనించాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

అటాచ్‌మెంట్‌తో కూడిన అటువంటి ఇ-మెయిల్‌లకు ప్రతిస్పందించకూడదని, అలాంటి కేసులను సమీప పోలీస్ స్టేషన్/సైబర్ పోలీస్ స్టేషన్‌లో నివేదించవచ్చని సాధారణ ప్రజలకు తెలియజేస్తున్నారు.

# సూర్యారాధన ఆచరించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్..



అమరావతి, జులై 5 :ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సమాజ శ్రేయస్సు, దేశం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ సూర్యారాధన చేశారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పవన్ కళ్యాణ్ ప్రస్తుతం వారాహి ఏకాదశ దిన దీక్షలో ఉన్నారు. ఇందులో భాగంగా సూర్యారాధన నిర్వహించారు. వారాహి ఏకాదశ దిన దీక్షలో భాగంగా నిర్వహించిన సూర్యారాధనలో వేదపండితులు బ్రహ్మశ్రీ కోసిగంటి సుధీర్ శర్మ, హరనాథశర్మ, వేణుగోపాలశర్మ ఈ పూజ విశిష్టతను పవన్ కళ్యాణ్ కు వివరించారు.

ప్రజల జీవన విధానంలో సూర్య నమస్కారాలు ఒక భాగమని వివరించారు. వనవాసంలో ధర్మరాజు ప్రత్యక్ష భగవానుడిని ప్రార్థించి అక్షయ పాత్ర పొందారని మహా భారతం చెబుతోందన్నారు. శ్రీ మహావిష్ణువు సూర్యభగవానుడి నుంచి చక్రాయుధాన్ని పొందారని వివరించారు. బ్రిటిష్ పాలకుల ప్రభావంతో ఆదివారం అంటే సెలవు దినంగా మారిపోయిందని, నిజానికి మన దేశ సంస్కృతిలో ఆదివారానికి విశిష్టత ఉందన్నారు. రవివారం అని పిలిచే ఆ రోజు సూర్యుడిని ఆరాధించి పనులకు శ్రీకారం చుట్టేవారని గుర్తు చేశారు. అందుకే ఆదివారాన్ని కృషివారం అని కూడా అంటారని వేద పండితులు తెలిపారు.

# ఇది ప్రతీకారపాలన.. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్




వరంగల్, జులై 5 : ప్రజాపాలన అందిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు ప్రతీకార పాలన సాగిస్తోందని మాజీ చీఫ్ విప్, బీఆర్ ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వినయ్ భాస్కర్ అన్నారు. గురువారం బాలసముద్రం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు.

ఈసందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ? కాంగ్రెస్ ఆరు నెలల్లోనే ప్రజల్లో వ్యతిరేకతను కూడగట్టుకుందన్నారు. హామీలు నెరవేర్చుకుంటే నిలదీస్తున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నాయకులు తెలంగాణ వ్యాప్తంగా అవినీతికి పాల్పడుతూ, అసత్య ఆరోపణలు చేస్తూ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

పార్టీ కార్యకలాపాల కోసం సర్వేనెంబర్ 1066 లో ఒక ఎకర భూమిని ప్రభుత్వం నుంచి బీఆర్ఎస్ రూ.4,84,000 కు కొనుగోలు చేస్తే, వాటిని రద్దు చేయాలని మున్సిపాలిటీ డిప్యూటీ కమిషనర్ కు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై తాము వివరణ కూడా ఇచ్చామన్నారు. హనుమకొండ జిల్లాలో కాంగ్రెస్ కార్యాలయానికి కూడా మున్సిపాలిటీ స్థలాన్ని కేటాయించిందని, ఆ పార్టీ వారు ఆంధ్ర బ్యాంకుకు కిరాయి ఇచ్చారని విమర్శించారు.

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ? ఒక ఇటుక పెళ్ల కదిపినా గాంధీభవన్ కూలుతుందని హెచ్చరించారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి బోయినపల్లి మెయిన్ రోడ్ లో పది ఎకరాల భూమిని రాజీవ్ గాంధీ నాలెడ్జ్ సెంటర్ కు కేటాయించారని గుర్తు చేశారు.

కిన్నెర ఆర్ట్ థియేటర్స్
హైదరాబాద్
ఆహ్వానం
శ్రీ కొక్కుల శివకృష్ణ రచించిన
సముద్ర నానీలు
గ్రంథావిష్కరణ
ఆదివారం 07-07-2024
ఉదయం 10 గంటలకు
రవీంద్రభారతి సమావేశ మందిరం,
మొదటి అంతస్తు, హైదరాబాదు




ముఖ్యఅతిథి - ఆవిష్కర్త
డా॥ ఎన్. గోపి
పూర్వ వైస్ ఛాన్సలర్, తెలుగు విశ్వవిద్యాలయం
కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత



సభాధ్యక్షులు
ఆచార్య సూర్యా ధనంజయ
పూర్వ అధ్యక్షులు, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం
విశిష్ట అతిథులు :
డా॥ పోరెడ్డి రంగయ్య
ప్రముఖ కవి, వ్యాఖ్యాత
శ్రీ కుడికాల వంశీధర్
ప్రముఖ కవి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్
గౌరవ అతిథులు
శ్రీ సుంకరి కృష్ణ ప్రసాద్, ప్రముఖ కవి
శ్రీ చిత్తలూరి సత్యనారాయణ, ప్రముఖ కవి
డా॥ ఆర్. ప్రభాకరరావు, ఐ.పి.ఎస్. (రి) అధ్యక్షులు
మద్దాళి రఘురామ్ కార్యదర్శి

# స్వయం సహాయక బృందాల మహిళల వ్యాపార వృద్ధి కోసం కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ మరియు సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల శాఖ చేతులు కలిపాయి

న్యూఢిల్లీ, జులై 5 :కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ పథకాల స్వయం సహాయక బృందాల (ఎస్.హెచ్.జి) మహిళలు నిర్వహిస్తున్న గ్రామీణ పరిశ్రమలకు ఊతమివ్వడానికి అలాగే వాటిని బలోపేతం చేయడానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ (ఎమ్.ఓ.ఆర్.డి), కేంద్ర సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఈరోజు స్టేట్మెంట్ ఆఫ్ ఇంటెంట్ (ఎస్.ఓ.ఐ)పై సంతకాలు చేశాయి.

కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి శ్రీ శైలేష్ కుమార్, ఎం.వో.ఎమ్.ఎస్.ఎమ్.ఇ. కార్యదర్శి శ్రీ ఎస్.సి.ఎల్. దాస్, అలాగే గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కార్యదర్శి శ్రీ చరణ్‌జిత్ సింగ్‌లతో పాటు రెండు మంత్రిత్వ శాఖలకు చెందిన ఇతర సీనియర్ అధికారుల సమక్షంలో న్యూఢిల్లీలోని కృషి భవన్‌లో గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీమతి స్వాతి శర్మ, సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీమతి మెర్సీ ఎపావోలు ఈ ఎస్.ఓ.ఐ.పై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీమతి స్వాతి శర్మ మాట్లాడుతూ, ఎం.వో.ఎమ్.ఎస్.ఎమ్.ఇ. అలాగే గ్రామీణాభివృద్ధి శాఖల మధ్య జరిగిన ఈ ఎస్.ఓ.ఐ. స్వయం సహాయక సంఘాల మహిళల అభివృద్ధి పట్ల ప్రభుత్వ విధానాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ ఆకాంక్షలకు అనుగుణంగా లక్పతీ దీదీల సాధికారతను ఈ ఒప్పందం సులభతరం చేస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా శ్రీమతి మెర్సీ ఎపావో మాట్లాడుతూ, స్వయం సహాయక బృందాల మహిళలు ఎం.వో.ఎమ్.ఎస్.ఎమ్.ఇ. ద్వారా అందించబడుతున్న యశస్విని - అప్నా ఉద్యమ్, అప్నీ పెహచాన్, ఉద్యమ్ అసిస్ట్ వంటి ప్రధాన పథకాలను ఉపయోగించుకోవడంలో వారికి మద్దతునిస్తూ వారిని అభివృద్ధి పథంలో నడిపించడంలో ఈ ఎస్.ఓ.ఐ. రెండు మంత్రిత్వ శాఖల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఆకాంక్షించారు.

గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి, ఎమ్.ఎస్.ఎమ్.ఇ. మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఇరువురూ ఈ ఒప్పందాన్ని అభినందించారు అలాగే ఈ ఒప్పందానికి అనుగుణంగా పరస్పర సహకారంతో చర్యలు చేపట్టేందుకు కట్టుబడి ఉన్నట్లు ప్రకటించారు.

# 8.40 శాతం జిఎస్ 2024 తిరిగి చెల్లింపు

న్యూఢిల్లీ, జులై 5 :'8.40 శాతం జిఎస్ 2024' కి సంబంధించిన బకాయి మొత్తం జూలై 26, 2024 (జూలై 28, 2024 ఆదివారం మరియు జూలై 27, 2024 పని చేయని శనివారం) సమానంగా తిరిగి చెల్లిస్తారు. చెప్పిన తేదీ నుండి దానిపై ఎటువంటి వడ్డీ జమకాదు. నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ యాక్ట్, 1881 ప్రకారం ఏదైనా రాష్ట్ర ప్రభుత్వం రీపేమెంట్ రోజున సెలవు ప్రకటించినట్లయితే, ఆ రాష్ట్రంలోని చెల్లింపు కార్యాలయాల ద్వారా రుణం/లు మునుపటి పని రోజున తిరిగి చెల్లిస్తారు.

ప్రభుత్వ సెక్యూరిటీల నిబంధనలు 2007, ఉప-నిబంధనలు 24(2) మరియు 24(3) ప్రకారం, మెచ్యూరిటీ చెల్లింపును అనుబంధ జనరల్ లెడ్జర్ లేదా రాజ్యాంగ అనుబంధ జనరల్ లెడ్జర్ ఖాతా లేదా స్టాక్ సర్టిఫికేట్ రూపంలో ఉన్న గవర్నమెంట్ సెక్యూరిటీ రిజిస్టర్డ్ హోల్డర్‌కు చెల్లించాలి. అతని బ్యాంక్ ఖాతా సంబంధిత వివరాలను పొందుపరిచే పే ఆర్డర్ ద్వారా లేదా ఎలక్ట్రానిక్ మార్గాల ద్వారా నిధులను స్వీకరించే సదుపాయం ఉన్న ఏదైనా బ్యాంకులో హోల్డర్ ఖాతాకు క్రెడిట్ ద్వారా చేయబడుతుంది. సెక్యూరిటీలకు సంబంధించి చెల్లింపు చేసే ఉద్దేశ్యంతో, అసలు సబ్‌స్క్రైబర్ లేదా అటువంటి ప్రభుత్వ సెక్యూరిటీల తదుపరి హోల్డర్లు, వారి బ్యాంక్ ఖాతాకు సంబంధించిన సంబంధిత వివరాలను చాలా ముందుగానే సమర్పించాలి.

ఏదేమైనప్పటికీ, బ్యాంకు ఖాతా సంబంధిత వివరాలు లేనప్పుడు / ఎలక్ట్రానిక్ మార్గాల ద్వారా నిధులను పొందడం కోసం ఆదేశం, గడువు తేదీలో రుణాన్ని తిరిగి చెల్లించడానికి వీలుగా, హోల్డర్లు పబ్లిక్ డెట్ ఆఫీసులు, ట్రెజరీలు/సబ్ ట్రెజరీ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలు (వాటిలో వడ్డీ చెల్లింపు కోసం రిజిస్టర్ చేయబడి ఉంటాయి) వద్ద తిరిగి చెల్లించడానికి గడువు తేదీకి 20 రోజుల ముందుగానే సక్రమంగా విడుదల చేసిన సెక్యూరిటీలను టెండర్ చేయవచ్చు.

ఉత్సర్గ విలువ (డిశ్చార్జ్ వాల్యూ)ని స్వీకరించే ప్రక్రియ వివరాలను పైన పేర్కొన్న ఏదైనా చెల్లింపు కార్యాలయాల నుండి పొందవచ్చు.

# ఆస్ట్రేలియా-ఇండియా స్ట్రాటజిక్ రిసర్చ్ ఫండ్ ఫలితాలను ప్రకటించిన కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, జులై 5 :ఆస్ట్రేలియా-ఇండియా స్ట్రాటజిక్ రిసర్చ్ ఫండ్ (ఎఐఎస్ఆర్ఎఫ్) పదిహేనో విడత ఫలితాల ను కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత), పృథ్వీ శాస్త్రాల శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత), ప్రధాన మంత్రి కార్యాలయం (పిఎంఒ), అణుశక్తి విభాగం, అంతరిక్ష విభాగం శాఖ సహాయ మంత్రి, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పింఛన్ ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ వెల్లడి చేశారు.

విజేతలుగా నిలిచిన ప్రాజెక్టులకు ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో భాగంగా నిధులను ఇచ్చిన సంగతిని ఈ రోజున ఒక పత్రికా ప్రకటనలో తెలియజేయడమైంది.

ఆస్ట్రేలియా-ఇండియా స్ట్రాటజిక్ రిసర్చ్ ఫండ్ (ఎఐఎస్ఆర్ఎఫ్) ఒక ద్వైపాక్షిక కార్యక్రమం, ఇది ఆస్ట్రేలియాకు, భారతదేశానికి మధ్య సహకార పూర్వక పరిశోధన ప్రాజెక్టులకు దన్నుగా నిలుస్తోంది. రెండు దేశాల మధ్య శాస్త్ర పరమైన సంబంధాన్ని బలపరచడం, సంయుక్త పరిశోధనల ద్వారా ఉమ్మడి సవాళ్ళను పరిష్కరించడం ఈ కార్యక్రమం ధ్యేయం.

ఈ సంవత్సరం లో, వేరు వేరు విభాగాలలో అయిదు ప్రాజెక్టులకు ఎఐఎస్ఆర్ఎఫ్ నిధులను ఇచ్చింది. ఆయా విభాగాలలో కృత్రిమ మేధ (ఎఐ), మెషిన్ లెర్నింగ్, బయోటెక్నాలజీ, పట్టణ ప్రాంతాలలో గనుల త్రవ్వకంలతో పాటు ఎలక్ట్రానిక్ వ్యర్థాల రీసైకిలింగ్, చౌకైన సౌర, స్వచ్ఛ ఉదజని సాంకేతికతలు భాగంగా ఉన్నాయి. కఠినమైన మూల్యాంకన ప్రక్రియ ను అనుసరించి ఈ ప్రాజెక్టులను ఎంపిక చేసి, ఈ ప్రాజెక్టులు శాస్త్రీయపరమైన ఉత్కృష్టత తాలూకు అత్యున్నత ప్రమాణాలకు తులతూగేటట్టుగాను, గణనీయమైన ప్రభావాన్ని ప్రసరించేవిగాను శ్రద్ధ తీసుకోవడమైంది.

ఎంపిక చేసిన ప్రాజెక్టులు ఆస్ట్రేలియా కు చెందిన శాస్త్రవేత్తలు, భారతదేశానికి చెందిన శాస్త్రవేత్తలు నిర్వహిస్తున్న అనేక అధునాతన పరిశోధనలకు అద్దం పడతాయి. ఈ కార్యక్రమాలు రెండు దేశాలతో పాటు ప్రపంచంలో అనేక దేశాలకు కూడా ప్రయోజనకరంగా ఉండే విలువైన ఫలితాలను అందించగలుగుతాయన్న అంచనాలు ఉన్నాయి.

కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత), పృథ్వీ శాస్త్రాల శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత), ప్రధాన మంత్రి కార్యాలయం, అణుశక్తి విభాగం, అంతరిక్ష విభాగం శాఖ సహాయ మంత్రి, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పింఛన్ ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, పరిశోధన మరియు నూతన ఆవిష్కరణల పరంగా అంతర్జాతీయ సహకారానికి ఉన్న ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. "ప్రపంచంలో అనేక కీలక సవాళ్ళను పరిష్కరించడం కోసం, సుస్థిర అభివృద్ధిని పెంపొందింప చేయడం కోసం ఈ ఆధునిక యుగంలో సహకారం కీలక పాత్ర పోషిస్తుందని నేను అనుకుంటున్నాను. భారతదేశానికి, ఆస్ట్రేలియా కు మధ్య చిరకాలిక భాగస్వామ్యానికి ఒక ప్రమాణంగా ఎఐఎస్ఆర్ఎఫ్ ఉంది. ఈ సహకారం ద్వారా తెర మీదకు వచ్చిన ప్రాజెక్టులు పరస్పరం ప్రయోజనకరమైన రంగాలలో శాస్త్రీయ కోణంలో ముఖ్యమైన ఆవిష్కారాలకు, సాంకేతిక పురోగతులకు దారితీస్తాయని నేను నమ్ముతున్నాను. ఆస్ట్రేలియా లో ఒక చైతన్యవంతమైన నూతన ఆవిష్కరణల వ్యవస్థను నిర్మించడానికి మేం కట్టుబడి ఉన్నామని ఈ సందర్భంగా నేను పునరుద్ఘాటిస్తున్నాను. సమృద్ధమైన, స్థిరమైన భవిష్యత్తును అందించడం కోసం ఈ ప్రాజెక్టులలో పాల్గొంటున్న పరిశోధకులను అందరినీ నేను అభినందిస్తున్నాను." అన్నారు.

ఆస్ట్రేలియా కు చెందిన పరిశ్రమ, శాస్త్రాల శాఖ మంత్రి ఎడ్ హుసిక్ మాట్లాడుతూ, "ఈ ప్రపంచంలో అనేక క్లిష్టమైన సమస్యలు ఉన్నాయి. దేశాల మధ్య సహకారం శాస్త్రీయపరమైన అవరోధాలను దాటి ఒక మేలైన స్థితిని తీసుకు రావడంలో ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నది. సూక్ష్మక్రిములలో ఒక పట్టాన కొలిక్కి రానటువంటి జాతులు మొదలుకొని ఎలక్ట్రానిక్ వ్యర్థాల నుండి కృత్రిమ మేధ (ఎఐ) వరకు పరిశీలిస్తే, మన ప్రపంచం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాళ్ళతో పాటు భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్ళకు ఉత్తమ పరిష్కారాలను కనుగొనడానికి ఆస్ట్రేలియాలోని మెరికల వంటి ప్రతిభావంతులను ద్వైపాక్షిక పరిశోధన ప్రధానమైన భాగస్వామ్యం రంగంలోకి దింపింది. ఆస్ట్రేలియా-ఇండియా స్ట్రాటజిక్ రిసర్చ్ ఫండ్ (ఎఐఎస్ఆర్ఎఫ్) గత 18 సంవత్సరాలలో 360కి పైగా సహకార పూర్వక పరిశోధన ప్రాజెక్టులను ప్రసాదించింది. ఈ క్రమంలో మా దేశంలోని విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలు ప్రపంచ పరిశోధన కార్యాలలో ముందు వరుసలో నిలబడడానికి మార్గం సుగమం అయింది." అన్నారు.

# ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడడంతో, ముగిసిన పార్లమెంట్ సమావేశాలు



న్యూఢిల్లీ, జులై 5 :18వ లోక్‌సభకు సాధారణ ఎన్నికల తర్వాత, లోక్‌సభ మొదటి సెషన్, 264వ రాజ్యసభ సెషన్‌లు వరుసగా జూన్ 24, 27 తేదీలలో వరుసగా సమావేశం ప్రారంభం అయ్యాయి. లోక్‌సభ నిన్న, 2 జూలై, 2024న వాయిదా పడింది. రాజ్యసభ ఈరోజు 3 జూలై, 2024న వాయిదా పడింది.

న్యూఢిల్లీలో ఈరోజు విలేకరుల సమావేశంలో కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి శ్రీ కిరణ్ రిజిజు ఈ పార్లమెంట్ సమావేశాల వివరాలను వెల్లడించారు. లోక్‌సభలో మొదటి రెండు రోజులు 18వ లోక్‌సభకు కొత్తగా ఎన్నికైన సభ్యుల ప్రమాణం/ప్రతిజ్ఞ కోసం ప్రత్యేకంగా కేటాయించారని, సెషన్‌లో మొత్తం 542 మంది సభ్యులలో 539 మంది ప్రమాణం/ప్రతిజ్ఞ చేసారని ఆయన వెల్లడించారు.

ప్రమాణం/ప్రతిజ్ఞ సులభతరం కోసం, భారత రాష్ట్రపతి రాజ్యాంగం లోని ఆర్టికల్ 95(1) ప్రకారం ప్రొటెం స్పీకర్‌గా శ్రీ భర్తృహరి మెహతాబ్‌ను రాష్ట్రపతి నియమించారు. శ్రీ సురేష్ కొడికున్నిల్, శ్రీ రాధా మోహన్ సింగ్, శ్రీ ఫగ్గన్ సింగ్ కులస్తే, శ్రీ టి.ఆర్. బాలు, శ్రీ సుదీప్ బందోపాధ్యాయ, రాజ్యాంగంలోని ఆర్టికల్ 99 కింద సభ్యులు ప్రమాణం/ధృవీకరణను చేసే మరియు సభ్యత్వం పొందే వ్యక్తులు.

జూన్ 26, 2024న, లోక్‌సభ స్పీకర్ ఎన్నిక జరిగింది. లోక్‌సభ సభ్యుడు శ్రీ ఓం బిర్లా మూజువాణి ఓటు ద్వారా స్పీకర్‌గా ఎన్నికయ్యారు. అదే రోజు, ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ లోక్‌సభకు తన మంత్రిమండలిని పరిచయం చేశారు.

2024 జూన్ 27న, సమావేశమైన పార్లమెంట్, రాజ్యాంగంలోని ఆర్టికల్ 87 కింద ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు, ప్రభుత్వం గతంలో సాధించిన విజయాల వివరాలను తెలియజేస్తూ, దేశ భవిష్యత్తు అభివృద్ధికి సంబంధించిన రోడ్‌మ్యాప్‌ను కూడా వివరించారు. జూన్ 27, 2024న, ప్రధానమంత్రి తన మంత్రిమండలిని రాజ్యసభకు పరిచయం చేశారు.

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ 28 జూన్ 2024న ఉభయ సభల్లో ప్రారంభం కావాల్సి ఉంది. లోక్‌సభలో, అంతరాయాల కారణంగా, ఈ అంశంపై చర్చ 1 జూలై 2024న మాత్రమే ప్రారంభం అయింది. లోక్‌సభలో ఎంపీ శ్రీ అనురాగ్ ఠాకూర్, చర్చను ప్రారంభించగా, ఎంపీ ఎం. బన్సూరి స్వరాజ్, చర్చను బలపరిచారు. మొత్తం 68 మంది సభ్యులు చర్చలో పాల్గొనగా, 50 మందికి పైగా సభ్యులు తమ ప్రసంగాలను సభ టేబుల్‌పై ఉంచారు అంటే సభకు సమర్పించారు. జూలై 2, 2024న 18 గంటలకు పైగా చర్చ జరిగిన తర్వాత ప్రధానమంత్రి చర్చకు సమాధానమిచ్చారు. లోక్‌సభలో దాదాపు 34 గంటలపాటు 7 సిట్టింగ్‌లు జరిగాయి. ఒక రోజు పూర్తిగా పోయినప్పటికీ ఉత్పాదకత 105 శాతం ఉంది. రాజ్యసభలో, రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చను ఎంపీ శ్రీ సుధాంశు త్రివేది ప్రారంభించారు, దీనిని 28 జూన్ 2024న ఎంపీ శ్రీమతి కవితా పాటిదార్ బలపరిచారు. మొత్తం 76 మంది సభ్యులు చర్చలో పాల్గొన్నారు. 3 జూలై, 2024న ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దీనికి 21 గంటల కంటే ఎక్కువ సమయం ఇచ్చారు. రాజ్యసభ మొత్తం ఉత్పాదకత 100 శాతం పైగా ఉంది.

# మన కళాక్షేత్రం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నంది పురస్కార్ అవార్డుల ప్రదానం

హైదరాబాద్ జులై 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : మన కళాక్షేత్ర ఫౌండేషన్, మన ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ 24 (క్రాఫ్ట్ సెంట్రల్ రిజిస్ట్రేషన్ సంయుక్తంగా ఆధ్వర్యంలో త్యాగరాజ గాన సభ ప్రాంగణంలో పురస్కార అవార్డ్స్ 2024 అవార్డ్స్ కార్యక్రమం ప్రముఖ సినిమా టీవీ హీరో హీరోయిన్ల ఆధ్వర్యంలో ఘనంగా అవార్డును వేడుకగా జరిగాయి. ఈ సందర్భంగా టాటా మణి ఛారిటబుల్ ట్రస్ట్, ఫౌస్టినా ఫౌండేషన్ నేషనల్ న్యూ ఢిల్లీ. సంస్థల చైర్మన్ వ్యవస్థాపకులు డా.కాకుమాను జ్యోతి ని నంది పురస్కార్ అవార్డు తో ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమం లో పిల్లర్మాత ఫౌండేషన్ నేషనల్ న్యూ ఢిల్లీ పోలంకి జగదీష్ కుమార్ వ్యవస్థాపకుడు మరియు చైర్మన్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సావిత్రి, కవిత.బాణాల ప్రేమలత, పుల్ల కవిత, కదారి అన్నపూర్ణ , గరికిపాటి జగదాంబ, ఉషా రాణి పోలంకి, ప్రవీణ్ కుమార్ కాకుమాను, జగదీష్ కుమార్ ప్లాంకి, ప్రవీణ్ ఎస్కే, శాంత కుమారి, జి రామారావు, జి రామారావు, బి. మోరా నాగేశ్వరావు, డీజీపీ లక్ష్మి అందరి సహకారంతో కార్యక్రమం విజయవంతమైంది

# సింగరేణి బొగ్గు గనుల వేలం రద్దు చేయాలి - సీపీఐ జాతీయ నేత చాడ వెంకట్ రెడ్డి




కరీంనగర్, జులై 5 : సింగరేణి బొగ్గు గనుల వేలం రద్దు చేయాలని శుక్రవారం కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వామపక్ష పార్టీలైన సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా, మాస్ లైన్ నేతలు, కార్యకర్తలు ధర్నా చేశారు. ధర్నానుద్దేశించి సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ సింగరేణి సంస్థ ను వేలం వేస్తే ఊరుకోమన్నారు. వెంటనే వేలం పాట రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మర్రి వెంకటస్వామి, మంద పవన్, సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వా సుదేవ రెడ్డి, సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా మాస్ లైన్ జిల్లా నాయకుడు జిందంప్రసాద్ పాల్గొన్నారు.

# హుస్నాబాద్ అభివృద్ధిపై మంత్రి పొన్నం దృష్టి - మూడు జిల్లాల కలెక్టర్లతో సమీక్ష




కరీంనగర్, జులై 5 : హుస్నాబాద్ నియోజకవర్గం అభివృద్ధి కోసం మూడు జిల్లాల కలెక్టర్లు, అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. శుక్రవారం హుస్నాబాద్ లో కరీంనగర్, హనుమకొండ, సిద్ధిపేట జిల్లాల కలెక్టర్లతో సమావేశమైన ఆయన అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు.

జిల్లాల పునర్విభజనలో హుస్నాబాద్ నియోజకవర్గం మూడు జిల్లాల పరిధిలోకి వచ్చిందని, దీంతో నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో సమస్యలను ముగ్గురు కలెక్టర్లకు, అధికారులకు మంత్రి పొన్నం వివరించారు. సమస్యల పరిష్కారానికి, అలాగే నియోజకవర్గం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# అనాలోచిత పాలనతో శిధిలావస్థకు రాష్ట్ర రాజధాని - స్పీకర్ అయ్యన్న



అమరావతి, జులై 5 : ఓ నాయకుడు అనాలోచిత పాలన వల్ల అమరావతి రాజధాని శిథిలావస్థకు చేరిందని ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. శుక్రవారం రాజధాని ప్రాంతంలో ఆయన పర్యటించారు. అసంపూర్తిగా ఉన్న మీడియా, గ్రంథాలయం, డైనింగ్ హాళ్లను పరిశీలించి వెంటనే పూర్తి చేయాలని సీఆర్‌డీఏ కమిషనర్‌ను ఆదేశించారు అనంతరం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా స్పీకర్ మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం కనీసం అసెంబ్లీ భవనాలకు సున్నం కూడా వేయించలేక పోయిందని విమర్శించారు.

జగన్ సర్కారు పట్టించుకోకపోవడం వల్లనే..

చంద్రబాబు పాలనలో ఏపీ అసెంబ్లీ భవనం, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్వార్టర్లను హైదరాబాద్ కంటే బ్రహ్మాండంగా నిర్మించారని స్పీకర్ అయ్యన్న అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోక పోవడం వల్ల భవన సామగ్రిని దొంగిలించారని ఆరోపించారు. ఐదేండ్ల పాటు పనులు చేపట్టకపోవడంతో తిరిగి పనుల పూర్తికి అధనంగా మరో 3వందల కోట్ల ఖర్చు అవుతుందని పేర్కొన్నారు. ఇందుకు కావాల్సిన నిధులను సీఎం దృష్టికి తీసుకెళ్లి 9 నెలల్లో? క్వార్టర్లను సభ్యులకు అందజేసే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు. అందరం కలిసి రాజధానిని నిర్మించుకుని ప్రజలకు అంకితమివ్వాలని కోరారు.

# సంగారెడ్డి జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ క్రాంతి వల్లూరు



సంగారెడ్డి, జులై 5 : సంగారెడ్డి జిల్లా పరిషత్ పాలక వర్గాలకు గురువారంతో గడువు ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ కాంతి వల్లూరు, జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తిరిగి ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చేవరకు ప్రత్యేక అధికారిగా కొనసాగడం జరుగుతుందని ఆమె తెలిపారు.

# కుమారి ఆంటీని సత్కరించిన సోనూ సూద్



హైదరాబాద్, జులై 5 : బాలీవుడ్ నటుడు సోనూ సూద్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. కరోనా కష్టకాలంలో ఎంతో మందికి సాయం చేసి రియల్ హీరో అనిపించు కున్నాడు. కాగా.. ఇటీవల ఆయన సోషల్ మీడియాలో ఫేమస్ అయిన కుమారి ఆంటీ ఫుడ్ స్టాల్‌ను ఈరోజు సందర్శిం చారు. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలోని ఉన్న ఈ స్టాల్‌కు వెళ్లి ఆమెకు మద్దతు పలికాడు. ఇందుకు సంబంధించిన వీడియోను తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశాడు. తాను కుమారి ఆంటీతో ఉన్నానని, ఆమె గురించి ఎంతో విన్నట్లుగా ఆ వీడియోలో సోనూసూద్ చెప్పుకొచ్చారు.

ఉమెన్ ఎంపవర్మెంట్‌కి నిజమైన అర్థం ఇదేనని అన్నాడు. కుటుంబం కోసం స్త్రీలు ఎంతో కష్టపడుతు న్నారని, ఇందుకు కుమారి ఆంటీ సజీవ సాక్ష్యమన్నా డు. వెజ్, నాన్‌వెజ్‌లలో ఏదీ లభిస్తుందని అడుగగా.. రెండు ఉంటాయని కుమారి ఆంటీ చెప్పింది. తాను వెజిటేరియన్ అని ప్లేట్ ఎంతా అని అడిగారు. వెజ్ అయితే రూ.80, నాన్ వెజ్ అయితే రూ.120 అని తెలిపింది. తాను రూ.80 కస్టమర్ అంటూ అక్కడ నవ్వులు పూయించాడు. సోనూసూద్. అదే సమయంలో తనకు ఎంత డిస్కౌంట్ ఇస్తారని అడుగగా.. మీకైతే ఫ్రీగానే పెడతానని చెప్పింది. ఈ రోజు నాకు లాటరీ తగిలింది. ఫ్రీగా పెడతానంటే ప్రతి రోజు వస్తానని సోనూ అన్నాడు. మీరు ఎంతో మందికి సాయం చేశారు సార్ మీకు ఎంత పెట్టినా తక్కువే అంటూ కుమారి ఆంటి అంది. అనంతరం కుమారి ఆంటీని సోనూసూద్ సత్కరించారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియా లో వైరల్‌గా మారింది.

# మే 2024 లో ఎనిమిది ప్రధాన పరిశ్రమల్లో గణనీయంగా 10.2 వృద్ధి శాతాన్ని సాధించిన బొగ్గు రంగం

న్యూఢిల్లీ, జులై 5 :వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఎనిమిది ప్రధాన పరిశ్రమల సూచీ (ఐసిఐ) (2011-12 ఆధార సంవత్సరం) ప్రకారం, 2024 మే నెలలో ఎనిమిది ప్రధాన పరిశ్రమలలో బొగ్గు రంగం అత్యధికంగా 10.2 శాతం (తాత్కాలిక) వృద్ధిని నమోదు చేయగా, రెండవ స్థానంలో విద్యుత్ పరిశ్రమ ఉంది. బొగ్గు పరిశ్రమ 2024 మే నెలలో 184.7 పాయింట్ల సూచి చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 167.6 పాయింట్ల వద్ద ఉంది. దాని సంచిత సూచిక అంతకుముందు సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 2024-25 ఏప్రిల్ నుండి మే వరకు 8.9 శాతానికి పెరిగింది.

సిమెంట్, బొగ్గు, ముడి చమురు, విద్యుత్, ఎరువులు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఉక్కు వంటి ఎనిమిది ప్రధాన పరిశ్రమల ఉమ్మడి, వ్యక్తిగత ఉత్పత్తి నిర్వాహణను ఐసిఐ కొలుస్తుంది.

గతేడాది ఇదే కాలంతో పోల్చగా, ఎనిమిది ప్రధాన పరిశ్రమల ఉమ్మడి సూచి 2024 మే నెలలో గణనీయంగా 6.3% పెరుగుదలను నమోదు చేసింది. ఇది మొత్తం పారిశ్రామిక విస్తరణకు బొగ్గు రంగ గణనీయమైన సహకారాన్ని తెలుపుతోంది. గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో బొగ్గు రంగం ఎనిమిది ప్రధాన పరిశ్రమలలో మొత్తం వృద్ధి కన్నా అధిక వృద్ధిని సాధించి దాని సమస్థాయి పరిశ్రమలను అధిగమించింది, .

ఈ గణనీయమైన వృద్ధికి కారణం, 2024 మే నెలలో బొగ్గు ఉత్పత్తి భారీగా పెరగడం, ఉత్పత్తి 83.91 మిలియన్ టన్నులకు చేరుకోవడం, అంతకుముందు ఏడాది ఇదే కాలంతో పోలిస్తే గణనీయంగా 10.15 శాతం పెరుగుదలను నమోదు చేయడం అని చెప్పవచ్చు.

ఆహ్వానం
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
భాషా సాంస్కృతిక శాఖ
సహకారంతో
కిన్నెర ఆర్ట్ థియేటర్స్
ప్రముఖ సాహితీవేత్త
డా|| వోలేటి పార్వతీశం రచించిన
కొన్ని ఊసులు ఇంకొన్ని ఊహలు
కవితా సంపుటి
ఆవిష్కరణ-అంకితోత్సవం
06-07-2024 శనివారం, సా|| 6 గం||లకు
రవీంద్రభారతి సమావేశ మందిరం
(మొదటి అంతస్తు), హైదరాబాద్.






ముఖ్య అతిథి : డా|| కె.వి. రమణ, ఐ.ఏ.ఎస్. (రి) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు
అధ్యక్షులు : శ్రీ మండలి బుద్ధప్రసాద్ శాసన సభ సభ్యులు, ఆంధ్రప్రదేశ్
విశిష్ట అతిథి : డా|| ఏనుగు నరసింహారెడ్డి, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్
గౌరవ అతిథి : శ్రీ నగ్నముని, దిగంబర కవితోద్యమ ప్రయోక్త
ఆత్మీయ అతిథి : శ్రీమతి శైలజామిత్ర, రచయిత్రి
కృతి స్వీకర్త : శ్రీమతి ప్రేమామాన్వి, దూరదర్శన్ పూర్వ ప్రయోక్త
ప్రముఖ గాయని శ్రీమతి సురేఖామూర్తి దివాకర్ల
లలిత సంగీత విభావరి
డా|| ఆర్. ప్రభాకరరావు, ఐ.పి.ఎస్. (రి) అధ్యక్షులు
మద్దాళి రఘురామ్ కార్యదర్శి

# గూటిలో చిత్తూరు మేయర్ , డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు




అమరావతి, జులై 5 :చిత్తూరు జిల్లా కేంద్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి శుక్రవారం గట్టి ఎదురు దెబ్బ తగిలింది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి సొంత జిల్లాలో వైసీపీకి చెందిన చిత్తూరు కార్పొరేషన్ మేయర్ అముద , డిప్యూటీ మేయర్ రాజేష్ రెడ్డి, 23 మంది కార్పొరేటర్లు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలోకి చేరారు. పార్టీ కండువాలు కప్పిచిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కటారి హేమలత వీరిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఇక చిత్తూరులో మాజీ మంత్రి పెద్దిరెడ్డి జమానాకు బ్రేక్ పడినట్టేనని రాజకీయవర్గాలు విశ్లేషిస్తున్నాయి.

చిత్తూరు కార్పొరేషన్ లో 50 డివిజన్లు ఉన్నాయి. గత ఎన్నికల్లో 46 డివిజన్లలో వైసీపీ కార్పొరేటర్లు ఎన్నికయ్యారు. ఇందులో చాలా వరకు ఏకగ్రీవంగానే ఎన్నికయ్యారు. వైసీపీ నాయకులు దౌర్జన్యాలతో టీడీపీ నాయకులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారు. నామినేషన్లు వేసిన వారిని నయన, భయానా బెదిరించి ఉపసంహరించుకునే విధంగా చేశారు. ఫలితంగా ముగ్గురు మాత్రమే తెలుగుదేశం పార్టీ తరఫున కార్పొరేటర్లు ఎన్నికయ్యారు. ఒక ఇండిపెండెంట్ కార్పొరేటర్ ఎన్నికయ్యారు. వైసీపీకి సూపర్ డూపర్ మెజారిటీ రావడంతో ఆముద కార్పొరేషన్ మేయర్ గా వైసీపీ పార్టీ ప్రకటించింది.

గతంలో చిత్తూరు కార్పొరేషన్ వ్యవహారాలతో పాటు పార్టీని, ప్రభుత్వాన్ని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నడిపారు. ఆయన కనుసన్నల్లోనే పార్టీ నాయకులు, కార్యకర్తలు, శాసనసభ్యులు పనిచేశారు. వైసీపీ ఓడిపోవడంతో జిల్లాలో ఆ పార్టీకి నాయకత్వ లేమి ఏర్పడింది. పార్టీని ముందుకు నడిపే పెద్దదిక్కు లేకుండా పోయింది. పెద్దిరెడ్డిని కట్టడి లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ నాయకులు వరుసగా కార్యక్రమాలు చేస్తున్నారు. ఆయన సొంత నియోజకవర్గంలో పర్యటించడానికి సైతం టీడీపీ నాయకులు అంగీకరించలేదు. అడ్డుపడుతున్నారు. దీంతో రెండు సార్లు పెద్దిరెడ్డి తన పర్యటనను వాయిదా వేసుకున్నారు. అలాగే తిరుపతిలో ఆయన ఒక వీధిని అక్రమించారని జనసేన నాయకులు ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చిత్తూరు జిల్లాలో వైసీపీకి సారథ్యం వహించే నేత కరువయ్యారు. దీంతో వైసీపీలో ఉంటే తమకు రాజకీయ భవిష్యత్తు ఉండదని భావిస్తున్న వైసీపీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు తెలుగుదేశం పార్టీ వైపు చూస్తున్నారు.

పది రోజులకు ముందు పుంగనూరుకు చెందిన మున్సిపల్ చైర్పర్సన్, వైస్ చైర్మన్ పుంగనూరు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన చల్లా రామచంద్రరెడ్డిని కలిసి తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్లు తెలిపారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరే ప్రజాప్రతినిధుల విషయంలో తెలుగుదేశం పార్టీ ఇప్పటి వరకు ఏ నిర్ణయం తీసుకోకపోవడంతో పుంగనూరులో చేరికలను పెండింగ్ లో పెట్టినట్లు తెలుస్తోంది. చిత్తూరులో మాత్రం టీడీపీలో చేరిన మేయర్, ఉప మేయర్, కార్పొరేటర్లను టీడీపీ నాయకులు కండువా చేసి పార్టీలోకి ఆహ్వానించారు.

## బస్సులోనే ప్రసవం.. మహిళా కండక్టర్ మానవత్వం

హైదరాబాద్, జులై 5 :తెలంగాణ ఆర్టీసీ బస్సులో పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణికి ఆర్టీసీ కండక్టర్ పురుడు పోసి మానవత్వం చాటుకున్నారు. హైదరాబాద్ ముషీరాబాద్ డిపోనకు చెందిన 1 జెడ్ రూట్ బస్సులో శుక్రవారం ఉదయం శ్వేతా రత్నం అనే గర్భిణీ ఆరాంఘర్ లో ఎక్కారు. బహదూర్ పూర వద్దకు రాగానే ఆమెకు పురిటి నొప్పులు తీవ్రమయ్యాయి.

ఈ విషయాన్ని గమనించిన కండక్టర్ ఆర్.సరోజ అప్రమత్తమై మహిళా ప్రయాణికుల సాయంతో సాధారణ ప్రసవం చేశారు. ఆమె పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చారు.

అనంతరం మెరుగైన వైద్యం కోసం సమీపంలోని గవర్నమెంట్ మెటర్నిటీ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం తల్లిబిడ్డా క్షేమంగా ఉన్నారు. బస్సులోనే కాన్పు చేసి మానవత్వం చాటుకున్న కండక్టర్ సరోజతో పాటు సహ మహిళా ప్రయాణికులను టిజిఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ అభినందనలు తెలియజేశారు. అప్రమత్తమై సకాలంలో స్పందించడం వల్లే తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారని పేర్కొన్నారు.

ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చడంతో పాటు సేవా స్ఫూర్తిని ఆర్టీసీ సిబ్బంది చాటుతుండటం ప్రశంసనీయమని అన్నారు.

# సాంఘీక సంక్షేమ గురుకుల హాస్టల్లో దారుణం..

### అర్ధరాత్రి పదోతరగతి విద్యార్థులపై ఇంటర్ విద్యార్థుల దాడి...
### విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన నైట్ స్టే అధికారి,వాచ్ మెన్ లకు మెమోలు....



మెదక్, జులై 5 : పదవ తరగతి విద్యార్థులపై ఇంటర్ విద్యార్థులు విచక్షణా రహితంగా దాడి చేసి గాయపర్చిన సంఘటన సిద్దిపేట జిల్లా చేర్యాల మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. దెబ్బల ధాటికి తట్టుకోలేక భయంతో వీధుల వెంబడి పరురుగులు తీస్తూ పోలీస్ స్టేషన్ కు చేరుకున్నారు. వివరాల్లోకి వెళ్తే? మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల హాస్టల్ లో పదవ తరగతి విద్యార్థులు వారి తరగతి గదిలో చదువుకుంటున్న సమయంలో అదే హాస్టల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కొంతమంది విద్యార్థులు అల్లరి చేస్తున్నారనే నెపంతో అకారణంగా బెల్టులతో, కర్రలతో విచక్షణా రహితంగా కొట్టడంతో దెబ్బలను తట్టుకోలేక ప్రహరీ గోడ దూకి పరుగులు తీస్తూ తల దాచుకొనేందుకు సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పోలీసు స్టేషన్ కు చేరుకున్నారు.

### బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం: ప్రిన్సిపాల్ బి.అశోక్ బాబు

అర్ధరాత్రి జరిగిన ఘటన పై ప్రిన్సిపాల్ అశోక్ బాబు మాట్లాడుతూ? పదవతరగతి విద్యార్థులపై దాడి చేసిన ఘటన వాస్తవమేనని, ఘర్షణలో పదవ తరగతి విద్యార్థులు కొంతమంది గాయపడ్డారని తెలిపారు. దాడి చేసిన ఇంటర్ విద్యార్థులపై చర్యలు తీసుకుంటామని, వారిని కళాశాల నుండి బయటికి లేదా వేరే కళాశాలకు పంపించడానికి ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తున్నట్టు తెలిపారు. విధుల్లో ఉండి నిర్లక్ష్యం వహించిన నైట్ స్టే అధికారి పాము కృష్ణమూర్తి, వాచ్ మెన్ లక్ష్మణ్ కు మెమో జారీ చేస్తున్నట్లు తెలిపారు.

### పాఠశాలను సందర్శించిన ఆర్సిఓ.

రాత్రి జరిగిన సంఘటనపై స్పందించిన రివిజినల్ కోఆర్డినేటర్ నిర్మల పాఠశాల, హాస్టల్ ను సందర్శించి ఇరువురు విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం నిర్మల మాట్లాడుతూ.. జరిగిన ఘటనపై విచారణ జరిపి శాఖపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# భూకబ్జా అక్రమ నిర్మాణంపై జిల్లా కలెక్టర్‌కు వినతి




ఖమ్మం, జులై 5 :(నేటినిజం ప్రతినిధి): కొంత మంది తమ స్థలాన్ని ఆక్రమించుకోవడమే కాకుండా అక్రమంగా నిర్మాణ పనులు ప్రారంభించారని, మహిళలు అని కూడా చూడకుండా తమపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారని, తమకు తగిన న్యాయం చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ కు వివిధ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో బాధితులు శుక్రవారం వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజా మ్మిల్ ఖాన్ బాధితులు అందజేసిన ఫిర్యాదును అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్, ఖమ్మం నగర ఏసీపీలకు పంపించారు. వినతి పత్రం సమర్పించిన బృందంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కె.వి.కృష్ణారావు, మహాత్మాజ్యోతిబాపూలే సొసైటీ అధ్యక్షులు పి.విజయకుమార్, రిటైర్డ్ సీఐ పుల్లూరి నాగయ్య, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు బద్రునాయక్, తెలంగాణ జన సమితి నగర అధ్యక్షుడు జంగిపల్లి రవి, వీర నారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా గౌరవ అధ్యక్షురాలు షేక్ నజిమా, జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉపేంద్ర బాయి నాయకురాలు జ్యోతి, ఉద్యమకారులు శ్రీనివాస్ నాయక్,దేవళ్ళ నాగేశ్వరరావు,బాలిన భాస్కర్,ప్రణయ్,బాధితులు చేపూరి పద్మ,శ్రావణి,నైనిషాతదితరులున్నారు.

## అనాలోచిత పాలన వల్ల శిథిలావస్థకు అమరావతి రాజధాని : ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

అమరావతి, జులై 5 : ఓ నాయకుడు అనాలోచిత పాలన వల్ల అమరావతి రాజధాని శిథిలావస్థకు చేరిందని ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. శుక్రవారం రాజధాని ప్రాంతంలో ఆయన పర్యటించారు. అసంపూర్తిగా ఉన్న మీడియా, గ్రంథాలయం, డైనింగ్ హాళ్లను పరిశీలించి వెంటనే పూర్తి చేయాలని సీఆర్‌డీఏ కమిషనర్‌ను ఆదేశించారు.

అనంతరం ఎమ్మెల్యే(ఓఎం), ఎమ్మెల్సీ క్వార్టర్ల ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్పీకర్ మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం కనీసం అసెంబ్లీ భవనాలకు సున్నం కూడా వేయించలేక పోయిందని విమర్శించారు. చంద్రబాబు పాలనలో ఏపీ అసెంబ్లీ భవనం, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్వార్టర్లను హైదరాబాద్ కంటే బ్రహ్మాండంగా నిర్మించారని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోక పోవడం వల్ల భవన సామగ్రిని దొంగిలించారని ఆరోపించారు.

ఐదేండ్ల పాటు పనులు చేపట్టకపోవడంతో తిరిగి పనుల పూర్తికి అధనంగా మరో 3వందల కోట్ల ఖర్చు అవుతుందని పేర్కొన్నారు. ఇందుకు కావాల్సిన నిధులను సీఎం దృష్టికి తీసుకెళ్లి 9 నెలల్లో? క్వార్టర్లను సభ్యులకు అందజేసే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు. అందరం కలిసి రాజధానిని నిర్మించుకుని ప్రజలకు అంకితమివ్వాలని కోరారు.

# తెలంగాణ శాసన మండలి మనుగడకు ప్రమాదం : వినోద్ కుమార్

హైదరాబాద్, జులై 5 :తెలంగణ శాసనమండలి ఉనికి ప్రమదంలో పడిందని మాజీ ఎంపీ బోయిన్‌లపల్లి వినోద్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. శాసన మండలి పూర్తిగా రద్దు అయ్యే ప్రమాదం ఉంది అని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో వినోద్ కుమార్ మీడియాతో మాట్లాడారు.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 171 పకారం శాసన మండలిలో కనీసం సీట్లు 40 ఉండాలని, అంత కంటే తక్కువ ఉండకూడదన్నారు. శాసనసభ సీట్లలో మూడో వంతు కౌన్సిల్ సభ్యులు ఉండాలన్నారు. కేంద్రం ప్రభుత్వం గత టర్మ్‌లో చేసిన రాజ్యాంగ సవరణతో ప్రస్తుతం శాసన మండలి ఉనికి ప్రమాదంలో పడిందన్నారు. ఆంగ్లో ఇండియన్ ఎమ్మెల్యేను తొలగించిందని, దీంతో తెలంగాణ అసెంబ్లీలో శాసనసభ్యుల సంఖ్య 119కి తగ్గిందన్నారు. గత అసెంబ్లీ టర్మ్ ముగిసే వరకు ఆంగ్లో ఇండియన్ పదవీ కాలం ఉందని, దీంతో గత అసెంబ్లీ సమయం ముగిసే వరకు ఎలాంటి ముప్పు రాలేదని వినోద్ కుమార్ తెలిపారు.

కానీ కేంద్రం చేసిన రాజ్యంగ సవరణ కొత్త అసెంబ్లీ నుంచి అమల్లోకి వచ్చిందని, ఇప్పుడు ఆంగ్లో ఇండియన్ సభ్యుడు అసెంబ్లీలో లేరని దీంతో ఎమ్మెల్యేల సంఖ్యయ 119 మాత్రేనని, దాని ప్రకారం రాజ్యాంగ నిబంధనలు 1/3 కౌన్సిల్ సభ్యుల సంఖ్య 39కి పడిపోయిందన్నారు. రాజ్యాంగం ప్రకారం కనీసం 40 మంది సభ్యులు ఉండాలనే నిబంధన ఉల్లఘించినట్లుగా అవుతుందన్నారు. దీనిపై ఎవరైనా కోర్టు వెళితే వెంటనే మండలి రద్దు అయ్యే అవకాశం ఉందన్నారు.

తెలంగాణ శాసన మండలి కొనసాగాలి అంటే అసెంబ్లీ స్థానాల సంఖ్య పెరగాలని, చంద్రబాబు పస్తుతం కేంద్రంలో కీలకంగా ఉన్నారని, శనివారం నాటి ఇద్దరు సీఎంలు కలిసి అసెంబ్లీ సీట్ల సంఖ్య పెంపుకు కృషి చేయాలని ఆయన సూచించారు. విభజన చట్టం 26 సెక్షన్ ప్రకారం తెలంగాణలో 153కు, ఏపీలో 225కు అసెంబ్లీ సీట్లను పెంచాల్సి ఉందన్నారు. గతంలో అసెంబ్లీ సీట్లను పూనర్విభజన చేయాలని కోరినా కేంద్రం స్పందించలేదని, కుంటి సాకులు చూపిందన్నారు. కానీ జమ్ము కశ్మీర్ లో అసెంబ్లీ సీట్లను పెంచుకున్నారని, కేంద్రానికి ఇష్టం ఉంటే సీట్లను పెంచుకుంటున్నారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి చంద్రబాబుతో మాట్లాడి విభజన చట్టంలో పేర్కొన్న విభజన చట్టంలో పేర్కొన్న విధంగా అసెంబ్లీ సీట్ల సంఖ్య పెరిగే విధంగా చూసి తెలంగాణ మండలి కొనసాగే విధంగా చూడాలన్నారు. శాసనమండలి అవసరమమని, పార్లమెంట్‌లో బిల్లు వచ్చిననాడు తాను సుదీర్ఘంగా ప్రసంగించానని ఆయన గుర్తు చేశారు. శాసనమండలిని కొనసాగించడానికి ప్రయత్నం చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి మాజీ ఎంపీ వినోద్ కుమార్ సూచించారు.

# పట్టిసీమ పైపులైన్ డ్యామేజీ - ఎగిసిపడ్డ నీళ్లు - రైతుల్లో ఆందోళన ..

అమరావతి, జులై 5 :పశ్చిమగోదావరి, కృష్ణాజిల్లా రైతులకు సాగునీరు, తాగునీటికి ఊరటనిచ్చే పట్టిసీమ ఎత్తిపోతలతో పథకాన్ని గత అయిదేళ్లుగా ప్రభుత్వం పక్కన పెట్టివేసింది. గత ఏడాదితాగునీటి ఎద్దడిని తట్టుకోలేక కొద్ది రోజులు పట్టిసీమను వినియోగించి ప్రభుత్వం మమ అనిపించింది. ఈ ఏడాది నాగార్జున ప్రాజెక్టు డెడ్స్టోరేజీకి చేరటంతో .. కృష్ణా, గుంటూరు జిల్లాలు తాగునీటి కోసం తల్లడిల్లిపోతున్నాయి. కనీసం కృష్ణాజిల్లా రైతులను ఆదుకునేందుకు పట్టిసీమ మోటార్లతో నీటి తరలింపు ప్రారంభించారు.ఏలూరు జిల్లా పోలవరంమండలం విక్కిసిరావుపేట వద్ద శుక్రవారం ఉదయం పట్టిసీమ పైప్ లైన్ పగిలిపోయింది.

ఎయిర్ వాల్ లీక్ ఘటనతో 20 అడుగులు ఎత్తులో నీళ్లు ఎగిసిపడుతున్నాయి. పట్టిసీమ ఎత్తిపోతల నుంచి పైప్ లైన్ ద్వారా కుడి కాల్వలోకి నీళ్లు వెళ్లే మార్గంలో పైప్ లైన్ ధ్వంసమైంది. ఈ క్రమంలో గోదావరి జలాలు పంట పొలాలను ముంచెత్తుతున్నాయి. గోదావరి నది నుంచి పోలవరం కుడి కాల్వ వరకు డెలివరీ ఛానల్ ఏర్పాటు చేశారు.రెండు రోజుల కిందట మంత్రి నిమ్మల రామానాయుడు ప్రారంభించారు.పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 2,800 క్యూసెక్కుల గోదావరి జలాలు పోలవరం ప్రాజెక్టు కుడి కాలవకు తాజాగా విడుదల చేశారు. పట్టిసీమ వద్ద గోదావరి నీటిమట్టం 14.74 మీటర్లకు పైబడి ఉండడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 8 పంపులు 8 మోటార్ల ద్వారా నీటి పంపిణీ చేశారు. ఈ క్రమంలోనే పైపులైన్ లీకేజీ జరిగింది. ఇటుకల కోట డెలివరీ ఛానల్‌కు వెళ్లే పైపు లైన్ వాల్ ప్లేట్ ఊడిపోయింది. ప్రస్తుతం పూర్తి స్థాయిలో నీటిని లిఫ్ట్ చేయడం లేదు.

పైప్ లైన్ లీకేజీతో తమ పొలాలు మునిగిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు నీటి లీకేజీ అరికట్టాలని కోరుతున్నారు. మరోవైపు పైప్‌లైన్ పగిలిపోయిన ప్రాంతానికి వెళ్లే మార్గం కూడా మూసుకుపోయింది. చెట్లు, పొదలతో నిండిపోయిన ప్రాంతానికి చేరాలంటే జంగిల్ క్లియర్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మోటార్లను నిలుపుదల చేస్తే తప్ప ఏ లైన్ పగిలిందో గుర్తించలేని పరిస్థితి ఉంది. దీంతో జలవనరుల శాఖ అధికారులు పైప్‌లైన్లలో ఏ మేరకు నష్టం జరిగిందో గుర్తించే పనిలో పడ్డారు.

మంత్రి నిమ్మల ఆదేశాలు

అటు, ఈ ఘటనపై స్పందించిన మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. సంబంధిత జలవనరుల శాఖ ఇంజినీర్‌లతో నిమ్మల ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే లీకేజిని అరికట్టాలని ఆదేశాలు జారీ చేశారు. మంత్రి ఆదేశాలతో లీకేజీ నివారించే చర్యలను అధికారులు చేపట్టారు. నీటి విడుదలను తాత్కాలికంగా నిలిపి జలవనరుల శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు. ఇటుకల కోట డెలివరీ ఛానల్‌కు వెళ్లే పైపు లైన్ వాల్ ప్లేట్ ఊడిపోవడంతో గోదావరి జలాలు ఎగజిమ్ముతున్నాయి. దాదాపు రెండు కిలోమీటర్ల మేర పంట పొలాల్లో నీరు చేరింది. లీకేజీ ప్రాంతానికి వెళ్ళడానికి , పొలాల్లోకి వెళ్ళడానికి మార్గం మూసుకుపోయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

# వ్యాపార, వాణిజ్య సంస్థలు కార్పొరేషన్ నిబంధనలు తప్పకుండా పాటించాలి..




నిజామాబాద్, జులై 5 : నిజామాబాద్ నగరంలో వ్యాపార, వాణిజ్య సంస్థలు కార్పొరేషన్ నిబంధనలు తప్పకుండా పాటించాలని.. లేకుంటే చర్యలు తప్పవని డిప్యూటీ కమిషనర్ రాజేంద్ర కుమార్ తెలిపారు. శుక్రవారం నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన్ రెవెన్యూ బృందం నగరంలోని పలు వ్యాపార వాణిజ్య సంస్థలు, హోటల్స్, మాల్స్ లలో జాయింట్ సర్వే చేపట్టారు.

నగరంలోని హెచ్.గంగారం, ఢిల్లీ వాలా స్వీట్ హోమ్, రిలయన్స్ మాల్, వేస్ట్ సైడ్ షోరూం వ్యాపార సంస్థల్లో కొలతలు నిర్వహించి పన్ను చెల్లింపుల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించారు. ట్రేడ్ లైసెన్స్, యూజర్ ఛార్జీల చెల్లింపు ధ్రువపత్రాలను పరిశీలించి నిబంధ నలు పాటించని వాణిజ్య సంస్థలకు నోటీసులు అందజేశారు. మాల్ లో ఆహార పదార్థాల పరిశుభ్రత, కిచెన్ నిర్వహణ సరిగా లేకపోవడంతో అధికారులు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ వో సాజిద్ అలీ, రెవెన్యూ అధికారి నరేందర్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భారీగా పెరగనున్న జనరల్ కోచ్‌లు : రైల్వే మంత్రి

న్యూఢిల్లీ, జులై 5 : ప్రత్యేక డ్రైవ్ కింద 2500 జనరల్ (ట్రైన్) కోచ్‌ల తయారీ చేపట్టామని, మరో 10,000 జనరల్ కోచ్‌లకు ఆమోదం లభించిందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ వెల్లడించారు. ఈ వేసవిలో భారీ రద్దీ, డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రైల్వేలు 100 00పైగా ప్రత్యేక రైళ్లను నడిపాయని మంత్రి తెలిపారు. రైల్వేల సేవలు, భద్రత, పరిశుభ్రతను మెరుగుపరిచేందుకు తాము కసరత్తు సాగిస్తున్నామని చెప్పారు.

50 అమృత్ భారత్ ట్రైన్ల తయారీ ప్రారంభమైందని, 150 అమృత్ భారత్ ట్రైన్ల తయారీ ప్రక్రియ దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయని వివరించారు. గత ఏడాది 5300 కిలోమీటర్ల నూతన ట్రాక్‌లు జోడించామని చెప్పారు. ఈ ఏడాది కూడా 800 కిలోమీటర్ల పైగా ట్రాక్‌ల ను జోడిస్తామని తెలిపారు. కవచ్‌ను అమలు చేసే ప్రక్రియ వేగవంతంగా సాగుతోందని మంత్రి వెల్లడించారు.కాగా అహ్మదాబాద్-ముంబయి మధ్య 2026 నాటికి దేశంలోనే తొలి బుల్లెట్ రైలు సర్వీసు అందుబాటులోకి వస్తుందని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ఇటీవల రైజింగ్ భారత్ సమ్మిట్‌లో పాల్గొన్న మంత్రి ఈ వివరాలు తెలిపారు. 2026 నాటికి దేశ తొలి బుల్లెట్ రైలు సిద్ధంగా ఉంటుందని చెప్పారు. అహ్మదాబాద్ -ముంబయి హైస్పీడ్ రైలు ప్రాజెక్టు నిర్మాణం పొడవు 508 కిలోమీటర్లుగా ఉంది. 2028లో పూర్తిస్థాయి విస్తరణ పూర్తవుతుందని మంత్రి పేర్కొన్నారు.

# స్మార్ట్ కిడ్జ్‌లోఉత్సాహంగా వనమహోత్సవం

### – మొక్కలునాటిన చిట్టిచేతులు
### – ఆకట్టుకున్నచిన్నారుల వనమహోత్సవర్యాలీ



ఖమ్మం, జులై 5 :(నేటినిజం ప్రతినిధి): స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శుక్రవారం పాఠశాల చిన్నారులు వన మహోత్సవం నిర్వహించారు. తమ చిట్టి చేతులతో రహదారుల ఇరువైపులా మొక్కలు నాటారు. పలు రకాల పూల మొక్కలు, పండ్ల నిచ్చే మొక్కలు, నీడ నిచ్చే మొక్కలను తమ చిట్టి చేతులతో ఉత్సాహంగా నాటారు. గుంతలు తీసి ఆ గుంతలో మొక్క నాటి నీరు పోసి ఆనందోత్సవాలతో ఈ వేడుకలో పాల్గొన్నారు. మొక్కలు నాటిన చిన్నారులే ప్రతిరోజు ఆయా మొక్కలను సంరక్షించే విధంగా జాగ్రత్తలు తీసుకున్నారు. తొలుత పాఠశాల చిన్నారులు మొక్కలతో నగరంలోని వివిధ ప్రాంతాలలో ప్రదర్శన నిర్వహించారు. మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని కాపాడుదాం. మొక్కలు నాటి ప్రాణవాయువును పిలుద్దాం. ఇంటింటా మొక్కలు నాటుదాం ఊరంతా పచ్చదనం నింపుదాం. గ్లోబల్ వార్మింగ్ ఇస్ గ్లోబల్ వార్నింగ్ అనే నినాదాలు ఉన్న ఫ్లకార్డ్లతో చిన్నారులు నిర్వహించిన ర్యాలీ అందరినీ ఆలోచింపజేసింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ...ప్రపంచవ్యాప్తంగా భూమి వేడెక్కడం పెను ప్రమాదంగా మారుతుందని, ఈ విపత్తు నుంచి రక్షించుకోవడానికి మొక్కలు నాటి చెట్లు పెంచడమే అందరి కర్తవ్యం అని పేర్కొన్నారు. మనల్ని రక్షించే ఓజోన్ పొర పదిలంగా ఉండాలంటే అందరూ వన మహోత్సవాలు నిర్వహించాలని కోరారు. వన మహోత్సవ వేడుకల్లో విద్యార్థులంతా భాగస్వాములై నాటిన ప్రతి మొక్కను చెట్టుగా ఎదిగేంతవరకు పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులున్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి నిరుద్యోగుల ఉసురు: మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

హైదరాబాద్, జులై 5 :తమ సమస్యల పరిష్కారం కోసం టీజీపీఎస్సీ వద్ద నిరసన తెలుపుతున్న నిరుద్యోగులను అరెస్టు చేయడం అమానుషమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి (ఔతితీజీనితీజీని ఖీవటటఎ) అన్నారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ పాలనలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తున్నదని విమర్శించారు. ప్రగతి భవన్ కంచెలు బద్దలుకొట్టామని ప్రగల్భాలు పలికారని, ఇప్పుడు హైదరాబాద్ నగరమంతా కంచెలు పాతుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

నిరుద్యోగులు శాంతియుతంగా నిరసన తెలుపుతాం అని చెప్పినా కాంగ్రెస్ ప్రభుత్వం అభద్రతా భావానికి లోనవుతున్నదని చెప్పారు. ఎన్నికల ముందు నిరుద్యోగులను రెచ్చగొట్టి వాడుకున్నారని విమర్శించారు. అధికారం చేతికి చిక్కాక ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీల గురించి ప్రశ్నిస్తే అణగదొక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రకటించిన పోస్టులకు అదనంగా ఒక్క పోస్టూ పెంచలేదన్నారు. గతంలో ఇదే నోటిఫికేషన్‌ను కుట్రపూరితంగా అడ్డుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిరుద్యోగుల ఉసురు తగులుతుందన్నారు. నిరుద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన నిరుద్యోగులందరినీ విడుదల చేయాలన్నారు.

## డబుల్ ఇంజిన్ సర్కార్‌లో డజనుకు పైగా వంతెనలు కుప్పకూలాయ్ : తేజస్వి యాదవ్

న్యూఢిల్లీ, జులై 5 : బిహార్‌లో డబుల్ ఇంజిన్ సర్కార్ ఉందని చెబుతున్నారని కానీ గత 20 రోజులుగా రాష్ట్రంలో డజనుకు పైగా వంతెనలు కుప్పకూలాయని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ఎద్దేవా చేశారు. ఆర్జేడీ వ్యవస్థాపక దినం సందర్భంగా శుక్రవారం తేజస్వి మీడియాతో మాట్లాడారు. పలు రైలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు.

బిహార్‌లో విచ్చలవిడిగా నేరాలు పెచ్చుమీరాయని అన్నారు. పేపర్ లీక్ ఘటనలూ వెలుగుచూశాయని తేజస్వి యాదవ్ చెప్పారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం నుంచి ఏ ఒక్కరూ ఈ విషయాలపై మాట్లాడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఈ అంశాల గురించి మాట్లాడితే తేజస్వినే ఇదంతా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.గత 17 ఏండ్లుగా గ్రామీణాభివృద్ధి శాఖ జేడీయూతోనే ఉందని, ఇప్పుడు కూలిన బ్రిడ్జిలను ఎవరు మంజూరు చేశారు, ఎవరు శంకుస్థాపన చేశారనే వివరాలను వెల్లడించాలని ఆయన సవాల్ విసిరారు. ఈ వివరాలు వెల్లడిస్తే ఎవరు అవినీతి పరులనేది తేటతెల్లమవుతుందని తేజస్వి యాదవ్ పేర్కొన్నారు. ఇదంతా డబుల్ ఇంజిన్ సర్కార్ నిర్వాకమే అని ఆయన మండిపడ్డారు.

